క్లుప్తంగా

నేడు ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్

విద్యారణ్యపురి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతజయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ మహానగరంలోని కాజీపేట, భవానీ నగర్, విశ్వవిద్యాలయ నగర్, హసన్‌పర్తి నగర్, హనుమకొండ నగర్ కాశిబుగ్గ, ఖిలా వరంగల్‌లో ఆదివారం ఉదయం రూట్ మార్చ్ (పథ సంచలన్) నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ మహానగర సంఘ సంచాలకుడు డాక్టర్ బందెల మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది స్వయం సేవకులు పూర్తి గణవేశ (యూనిఫామ్)లో పాల్గొంటారని పేర్కొన్నారు. హిందూ సమాజంలో జాగృతిని కలిగిస్తూ స్ఫూర్తి నింపేందుకు దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ రూట్‌మార్చ్‌ను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

8న కేయూలో బాలగోపాల్ స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: మానవ హక్కుల నేత దివంగత డాక్టర్ బాలగోపాల్ 15వ ఎండోమెంట్ లెక్చర్‌ను కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో ఈనెల 8న ఉదయం నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ అనే అంశంపై హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవ రావు పాల్గొని స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని రిజిస్ట్రార్ కోరారు.

గ్రూప్ -1 ర్యాంకర్‌కు సన్మానం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరుకు చెందిన గాలి విజయలక్ష్మి, రవికుమార్ దంపతుల కుమారుడు రాహుల్.. గ్రూప్ -1లో ప్రతిభ కనబరిచి అసిస్టెంట్ ట్రెజరర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ మేరకు రాహుల్‌ను 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, తదితరులు సన్మానించారు.

భూ నిర్వాసితులకు న్యాయం జరగనుంది

కాజీపేట రూరల్: అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ భూ నిర్వాసితులకు న్యాయం జరగనుందని రైల్వే జేఏసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాయడంపై అయోధ్యపురం భూ నిర్వాసితులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల బీజేపీ హనుమకొండ మాజీ అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి కాజీపేట రైల్వే జేఏసీ నాయకులు, అయోధ్యపురం భూ నిర్వాసితులు హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు రైల్వే జీఎంకు కేంద్ర మంత్రి లేఖ రాయడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

గౌడ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా గౌడ సంఘం సహాయ కార్యదర్శిగా శాంతినగర్‌కు చెందిన కొయ్యడ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్‌కు తెలంగాణ గౌడ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు గండి లక్ష్మయ్య గౌడ్ శనివారం నియామక పత్రం అందజేసి అభినందించారు.

హిందూ ధార్మిక పరిషత్ ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో హిందూ ధార్మిక పరిషత్ పరిషత్ సంస్థను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య పున్నమాచార్యులు శనివారం ప్రారంభించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండోజు వీరాచార్యులు, మరుపోజు జగదీశ్వర్, మదుపోజు గురుమూర్తి పాల్గొన్నారు.

పద్మాక్షిదేవి శాంతి కల్యాణం



కాజీపేట: హనుమకొండ జిల్లా కేంద్రంలోని హనుమద్గిరి పద్మాక్షిదేవి ఆలయ ఆవరణలో పద్మాక్షిదేవి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శనివారం నిర్వహించారు. వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని బృందం వేడుకలను కనులపండువగా జరిపించింది. భక్తులకు ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం దేవతామూర్తులతో తెప్పోత్సవం నిర్వహించారు.

కూల్చారు.. నిర్మాణం మరిచారు



రోడ్డు విస్తరణలో కూల్చివేసిన పాఠశాల ప్రహరీ



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయం

- రోడ్డు వెడల్పులో పాఠశాల ప్రహరీ కూల్చిన అధికారులు
- మూడేళ్లు గడుస్తున్నా నిర్మాణంపై ముఖం చాటు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- రాత్రి వేళల్లో ఆకతాయిల ఇష్టారాజ్యం

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు రెండు కలిసి ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. రెండు పాఠశాలల్లో సుమారు 280 మంది విద్యార్థులకు పైగా చదువుకుంటున్నారు. మూడేళ్ల క్రితం మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా అప్పటి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రహరీని కూల్చి వేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులకు రక్షణ కరువైంది. పాఠశాల ప్రధాన రహదారి సమీపంలో ఉండటం, పాఠశాల ఆవరణలో ఉన్న మండల విద్యావనరుల కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయానికి కేటాయించడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు పాఠశాల ఆవరణలోనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో విద్యార్థుల ఏకాగ్రత అటువైపు మళ్లుతుందని, చదువుపై దృష్టి పెట్టడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గతేడాది పదో తరగతి పరీక్షల సమయంలో పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో అప్పటికప్పుడు ప్రధాన రహదారి వెంబడి పరదాలు కట్టి పరీక్షలు నిర్వహించి పరీక్షల అనంతరం తొలగించారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో పలువురు పాఠశాల ఆవరణలో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడలకు దూరం..

ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే అప్పటి ప్రభుత్వం క్రీడా మైదానం, నర్సరీ, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు క్రీడలు ఆడుకునేందుకు స్థలం కరువైందని పలువురు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలోనే మండల పరిషత్ కార్యాలయం, వాహనాల పార్కింగ్, నర్సరీలు ఉండటంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని, ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కోరుతున్నారు. పాఠశాల ఆవరణలోని నర్సరీ, ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇతర చోటుకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల చదువు, భవిష్యత్‌పై దృష్టిసారించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు.

ప్రహరీ నిర్మించాలి



గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రెండు వైపులా ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వెంటనే నిర్మించాలి.

– ఇట్టబోయిన సంపత్, స్థానికుడు

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- ఎస్సై జక్కుల పరమేశ్



డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై జక్కుల పరమేశ్ వాహనదారులకు సూచించారు. శనివారం మండలంలోని మాందారిపేట సేజి వద్ద సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగి బాధితుల కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

‘స్థానికం’లో బీజేపీ జెండా ఎగరేయాలి



శాయంపేట : మాట్లాడుతున్న కీర్తిరెడ్డి



ఆత్మకూరు : పార్టీలో చేరిన వారితో నాయకులు

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి జెండా ఎగరేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీప్రసాదరావు, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సంతోశ్‌కుమార్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వేణుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, రాజు, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి కార్యకర్తలు, నాయకులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు.

సంక్షిప్తంగా

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

ఆత్మకూరు : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సంతోశ్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలానికి చెందిన నలుగురు రౌడీ షీటర్లను శనివారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల నియమావళి కఠినంగా ఉంటుందని, నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గాంధీ విగ్రహం నుంచి మల్లంపల్లి వరకు గల గుంతలమయంగా మారిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడారు. గుంతలమయంగా మారిన రహదారిపై గతంలో మట్టి పోసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కొత్తకొండ నుంచి ధర్మారం, మల్లంపల్లి వరకు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఇద్దరిపై కేసు

ఐనవోలు : బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్, అతని సోదరుడు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. కొండపర్తి గ్రామానికి చెందిన గుండోజు రాజు హైదరాబాద్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. దసరా పండుగకు స్వగ్రామం కొండపర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొండపర్తిలో తంపుల మోహన్ ఇంటి వద్ద కారు అడ్డుగా ఉండటంతో హారన్ కొట్టాడు. దీంతో తంపుల మోహన్, అతని తమ్ముడు వెంకటేశ్ కోపంతో ఊగిపోతూ తనపై దాడి చేశారని బాధితుడు రాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీంతో మోహన్, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మండలానికి నేడు మాజీ ఎమ్మెల్యే రాక

శాయంపేట : మండల కేంద్రంలో ఆదివారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ పేరుతో కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈసందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

బిల్డింగ్ కార్మికుల మహాసభ

ఐనవోలు : యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాలుగొవ మహాసభను ఆదివారం హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోళ్ల వెంకటస్వామి, ఇస్రం సుదర్శన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాసభకు రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండలంలోని బిల్డింగ్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రేటర్ వరంగల్ ఎస్ఈగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్ఈ)గా హెచ్.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కేఎంసీకి పార్థివ దేహం అప్పగింత



ఎల్లమ్మ (ఫైల్)

ఎంజీఎం: జయశంకర్ జిల్లా చెల్పూరు నివాసి దేవునూరి ఎల్లమ్మ (80) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సహకారంతో కేఎంసీకి అవయవ దాతల అసోసియేషన్ సభ్యులు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ మరణిస్తూ వంద మంది వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడ్డారని కొనియాడారు. మృతురాలి కుమారుడు దేవునూరి చంద్రమౌళి, ముగ్గురు కుమార్తెలు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

వడ్డెరలకు అవకాశం ఇవ్వాలి

కాజీపేట: రాష్ట్ర వ్యాప్తంగా మైనింగ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయంలో 30 శాతం వడ్డెర కుల సంఘాలకు ఇచ్చి ఆదుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్ డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వడ్డెర కులస్తులను ఆదుకున్నట్లుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయూతనందించాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. వడ్డెర కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సీపీఐ అభ్యర్థులను ఆదరించాలి

- పార్టీ జిల్లా కార్యదర్శి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రజలను కోరారు. శనివారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో సీపీఐ మండల సమావేశం ఆదరి రమేశ్ అధ్యక్షతన జరిగింది. ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ ప్రాంతంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్యపాత్ర పోషించిందని గుర్తు చేశారు. భూ సంస్కరణలను భూ స్వాముల నుంచి స్వాధీన చేసుకుని పేదలకు పంచిన చరిత్ర సీపీఐదని గుర్తుచేశారు. నాయకులు ఆదరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యురాలు రమాదేవి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రమేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, గుడుంబా పట్టివేత



ఆత్మకూరు : స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

ఆత్మకూరు : అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పాండవుల రఘుకు చెందిన కిరాణంపై దాడులు నిర్వహించగా రూ.9,400 విలువచేసే మద్యం బాటిళ్లు లభించాయి. అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

వేలేరు : మండల కేంద్రానికి చెందిన పలువురు బెల్ట్‌షాపు నిర్వాహకులను శనివారం తహసీల్దార్ హెచ్.కోమి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20లీటర్ల గుడుంబా..

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెంలో 20 లీటర్ల గుడుంబాను పట్టుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగిరేణిగూడెంలో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన బానోతు రమేశ్ తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నాడనే సమాచారం ఇచ్చిందని తెలిపారు. దీంతో దాడులు నిర్వహించగా 20లీటర్ల గుడుంబా లభించిందని, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వెంటనే పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పెద్దకోడెపాకలో మద్యం..

అలాగే పెద్దకోడెపాక గ్రామంలో బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన కోగిల తిరుపతి బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి రూ.2,610 విలువచేసే 14 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిరుపతిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

‘వెల్‌నెస్’కు కాజీపేట అనుకూలం

- అందుబాటులో భవనాలు
- సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న పింఛన్‌దారులు



కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న భవనాలు

కాజీపేట: ఇటీవల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను కాజీపేట పట్టణంలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న భవనంలో ఏర్పాటు చేయడం సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ట్రైసిటీలో ఉన్న పింఛన్‌దారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన కృషి ఫలించి వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్ ఏర్పాటు అంశం కొలిక్కి రాకపోవడంతో త్రినగరిలో ఎక్కడపెడితే బాగుంటుందనే చర్చలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. వరంగల్ పోస్టల్ భవనం ఇవ్వడానికి అధికారులు నిరాకరించినట్లుగా తెలుస్తోంది. హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సరైన భవనాలు లభించడం లేదు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను మెటర్నిటీ ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్నారు.

ఖాళీగా ఉన్న భవనాలు

కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సరిపడా భవనాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఈ భవనాల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాల భూ కొలతలు, ల్యాండ్ సర్వే కార్యాలయాలు ఉండేవి. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మాణంతో ఈ కార్యాలయాలను సుబేదారికి తరలించారు. దాదాపు మూడున్నర సంవత్సరాలుగా రెండు అంతస్తుల్లోని గదులు ఖాళీగా ఉంటున్నాయి. వాటిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే అద్దె భారం లేకపోవడమే గాక రిటైర్డ్ ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

10వేలకు పైగా పింఛన్‌దారులు

వరంగల్ మహానగరంలో రైల్వే, ఎఫ్‌సీఐ, పోస్టల్, టెలికాం తదితర సంస్థలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు సుమారు 10వేల మందికి పైగానే ఉంటారని అంచనా. వారిలో సగానికి పైగా కాజీపేట పట్టణంలోనే ఉంటారు. పట్టణంలో ఉన్న రెండు రైల్వే రిటైర్డ్ కార్మిక సంఘాల్లో 4,500 మంది వరకు సభ్యులు ఉన్నారు. కాజీపేట సర్కిల్ కార్యాలయంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న పింఛన్‌దారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. వరంగల్ ఎంపీ కడియం కావ్య మరోమారు జిల్లా అధికారులతో కలిసి వచ్చి వృథాగా ఉంటున్న భవనాలను పరిశీలించి అనుమతులు సాధించాలని పలువురు పెన్షన్‌దారులు కోరుతున్నారు.

కాజీపేట అనువుగా ఉంటుంది



కాజీపేటలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే పెన్షనర్లకు ఉపయుక్తంగా ఉంటుంది. నగరంలో ఉన్న పింఛన్‌దారులలో సగానికి కంటే ఎక్కువగా కాజీపేట పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వారిలో 70ఏళ్లు దాటిన వారు సగం మంది ఉంటారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే బాధలు తప్పుతాయి.

– గుర్రపు సుధాకర్ రావు, రిటైర్డ్ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

పేదల సంక్షేమమే ధ్యేయం



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న సుమన్

ఎల్కతుర్తి : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లి సుమన్ అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం బొల్లోనిపల్లి గ్రామంలో నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నూతన రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, స్థానికులతో పాటు తదితరులు పాల్గొన్నారు.